## క్లుప్తంగా

### ప్రకృతితోనే ఆరోగ్యవంతమైన జీవితం



**తెనాలిటౌన్:** ప్రకృతితోనే మనిషికి ఆరోగ్యవంతమైన జీవితం కలుగుతుందని ఫాదర్ విన్సెంట్ పేర్కొన్నారు. ఆదివారం చెంచుపేటలోని నిత్య సహాయమాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ విన్సెంట్ మాట్లాడుతూ దేవుడు సృష్టించిన ప్రకృతిని మానవుడు పాడు చేయడం వలన అనేక రుగ్మతలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రకృతిని పరిరక్షించాలంటే మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. దేవాలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి పలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో గురు శ్రీ ఫాదర్ స్లీవ, విజయ్‌కుమార్, ఎస్ఎస్ఎం యూత్ సభ్యులు, సిస్టర్లు పాల్గొన్నారు.

### విద్యార్థుల ఉన్నతికి కృషి



**తెనాలిఅర్బన్:** విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయురాలు డి.ఉమాదేవి కృషి చేస్తున్నారని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళాధర్ పేర్కొన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయరాలు అవార్డు అందుకున్న కొల్లిపర మండల ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ ఉమాదేవి దంపతులను జగ్గడిగుంటపాలెంలోని ఆయన స్వగృహంలో ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, కొల్లిపర మండల అధ్యక్షుడు వరప్రతాప్ కుమార్, ప్రధాన కార్యదర్శి కాలేషావలి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

### డాక్టర్ ప్రజ్ఞాచారికి జాషువా పురస్కారం



**తెనాలిటౌన్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సౌజన్యంతో అంతర్జాతీయ గుర్తింపు పొందిన సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని జిల్లా గ్రంథాలయంలో మహాకవి గుర్రం జాషువా జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఉషోదయం ఫౌండేషన్ ఏర్పాటు చేసిన సాహితీ సభలో తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీరత్న డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారికి నిర్వాహకులు గుర్రం జాషువా పురస్కారాన్ని ప్రదానం చేశారు. సాహితీ సభలో ప్రజ్ఞాచారి జాషువాకు పద్య నీరాజనం అనే శీర్షికతో పద్యపఠనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో భీమవరం ఎమ్మెల్యే టి.రామాంజనేయులు, సంస్థ సీఈవో డాక్టర్ ఎంవీ రత్నం, సంస్థ అంతర్జాతీయ కార్యనిర్వాహకులు డాక్టర్ ఉషారాణి, సాహితీవేత నాగేశ్వరరావు, డాక్టర్ బివి. సత్యనారాయణ, నారాయణస్వామి చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసపత్రాన్ని ప్రజ్ఞాచారి అందుకున్నారు. ఈ పురస్కారం లభించడం పట్ల ప్రజ్ఞాచారిని కొలకలూరు సాహితీ ప్రియులు, పెద్దలు అభినందించారు.

### అఖిల ఆంధ్ర సాధు పరిషత్‌చే అర్ధచాతుర్మాస వ్రతం



**తెనాలి:** పట్టణంలో 1965లో స్థాపించిన అఖిల ఆంధ్ర సాధుపరిషత్‌లో అర్ధచాతుర్మాస వ్రతం ఆదివారం నుంచి ప్రారంభించారు. అఖిల ఆంధ్ర సాధు పరిషత్ అధ్యక్షుడు పూజ్యశ్రీ పరమాత్మానందగిరి స్వాములవారి అధ్యక్ష ఆధ్వర్యంలో నవంబరు అయిదో తేదీ వరకు ఈ వ్రతం నిర్వహిస్తారు. పరిషత్ గౌరవాధ్యక్షుడు పూజ్యశ్రీ వాసుదేవానందగిరి స్వామి ఈ వ్రతాన్ని ప్రారంభించారు. పూజ్యశ్రీ స్కంద దేవానందగిరి స్వామి, పూజ్యశ్రీ సత్యానంద గిరి స్వామితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఆశ్రమాధిపతులైన స్వామీజీలు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి పూజ్య శ్రీ కృష్ణ చరణానంద భారతీస్వామి పర్యవేక్షించారు.

### మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

**తెనాలిటౌన్:** దసరా కానుకగా దేశవ్యాప్తంగా జీఎస్టీ శ్లాబులు తగ్గించడం హర్షణీయమని బీజేపీ జిల్లా నాయకుడు పాట్టిమూర్తి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ సెంటర్ వద్ద ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. బీజేపీ జిల్లా యువ మోర్చ అధ్యక్షుడు మైలా హరికృష్ణ, తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.వాసుదేవనాయుడు, సందీప్‌రాయుడు, అడపా సంపత్‌రాయుడు తదితరులు ఉన్నారు.

# వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులకు సత్కారం



వివిధ విభాగాల అధ్యక్షులను సత్కరించిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్

**తెనాలి:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో వివిధ పదవులను చేపట్టిన నాయకులు అంకితభావంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన గుంటూరు గోపి, లీగల్ సెల్ అధ్యక్షుడు మైల విజయ్‌నాయుడు, ప్రచార విభాగం అధ్యక్షుడు బండికళ్ల పోతురాజు, సోషల్ మీడియా అధ్యక్షుడు నీలి అజయ్‌లు ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను కలిశారు. తమ నియామకాలకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్, పార్టీ మీపై చూపిన నమ్మకాన్ని నిలుపుకోవాలని సూచించారు. బాధ్యతాయుతంగా పదవులను నిర్వహించాలని, పార్టీకి మంచిపేరు తీసుకురావాలని చెప్పారు. తొలుత యువజన విభాగం అధ్యక్షుడు గుంటూరు గోపి, లీగల్ సెల్ అధ్యక్షుడు మైలా విజయ్‌నాయుడు తమతమ అనుచరులతో భారీ ర్యాలీగా పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దేసు శ్రీనివాసరావు, కళ్లం వెంకట అప్పారెడ్డి, చెన్నుబోయిన శ్రీనివాసరావు, తాడిబోయిన రమేష్, నాలాది ప్రభాకర్, జ్యోతుల సుదీర్, కనపర్తి ప్రకాష్, బ్రదర్ తంబి, న్యాయవాదులు దాట్ల మోహన్ రెడ్డి, తాడిబోయిన బుచ్చిరాజు, కనపర్తి అబ్రహాం లింకన్, నక్క చంద్రశేఖర్, గుంటూరు కృష్ణ, బాబి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, కౌన్సిలర్ షేక్ దుబాయ్ బాబు, పెదలంక వెంకటేశ్వరరావు, ధరణికోట మల్లికార్జునరావు, అక్కి దాసు కిరణ్‌కుమార్, ఉన్నవ నాని, షేక్ గోల్డ్ రహిమ, చుక్క ఆనంద్ పాల్గొన్నారు.

## చాతుర్మాస దీక్ష విరమణ పూర్ణాహుతి



పూర్ణాహుతి పూజలు

**తెనాలి:** స్థానిక గంగానమ్మపేటలోని ది తెనాలి కమిషన్ మర్చంట్ అసోసియేషన్లో గత రెండు నెలలు నుంచి జరిపిన అర్ధ చాతుర్మాస్య వ్రతం ముగింపు సందర్భంగా పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) ఆదివారం పూర్ణాహుతిని నిర్వహించారు. చాతుర్మాస్య దీక్ష విరమణ, చంద్రమౌళీశ్వర ఆరాధన, శ్రీ చక్ర అర్చన, వాసవి సంకీర్తన అర్చన నిర్వహించారు పూజ్య బాల స్వామీజీ వారు మాట్లాడుతూ లోక కళ్యాణం, ప్రజల క్షేమం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా శ్రీవిద్య పీఠంలో విశేష గ్రహణ శాంతి జప యజ్ఞం కార్యక్రమాలు జరిపారు. చంద్రగ్రహణం సందర్భంగా పాటించాల్సిన నియమాలను బాలస్వామీజీ భక్తులకు వివరించారు. పెనుగొండ వాసవి శాంతి ధామం ప్రధానార్చకులు విశిష్ట మణికంఠచే హోమ కార్యక్రమాలు నిర్వహించారు, ముఖ్యఅతిథిగా హాజరైన శరణాగతి గోష్టి వ్యవస్థాపకులు శ్రీ నరేంద్ర రామానుజ దాసస్వామి భగవద్ తత్వ వైభవాన్ని చెప్పారు. వాసవి సత్ర సముదాయం చైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు, టీటీడీ దాస ప్రాజెక్టు గుంటూరు కృష్ణా జిల్లా అధ్యక్షుడు శ్రీమాన్ గద్దిపాటి శ్రీనివాసరావు, చుండూరు ఉమామహేశ్వరరావు, సాధన మండలి బ్రహ్మవిద్య ఆశ్రమం, బుర్ల అరుణ కుమారి, కనికచర్ల మణికంఠ, నంబూరి వెంకట కృష్ణమూర్తి, రావూరి సుబ్బారావు, ముద్దాభక్తుని రమణయ్య, పల్లపోతు మురళీమోహన్, గోపు రామకృష్ణ, రాజేశ్వరరావు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

## అ'పూర్వ' సమ్మేళనం..!

- పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం
- 39 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు



గురువులను సత్కరించిన పూర్వవిద్యార్థులు

**తెనాలి:** పట్టణంలోని గౌతమ్ గ్రాండ్ హోటల్ కాన్ఫరెన్స్ హాలు ఆదివారం ఒక అపురూప సన్నివేశానికి వేదికైంది. అది పూర్వవిద్యార్థుల సమావేశం. వారంతా స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కాలేజీలో 1983–86 బ్యాచ్ బయాలజీ విద్యార్థులు. ప్రస్తుతం ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. కొందరైతే ఉద్యోగ విరమణ కూడా చేశారు. మళ్లీ ఇన్నేళ్లకు తమ నేస్తాలను కలుసుకోవాలని అనుకున్నారు. అనుకున్నదే తడవుగా సన్నాహాలు ఆరంభించారు. అవి ఫలించి ఆదివారం ఆత్మీయ సమావేశంలో కలుసుకున్నారు. పరస్పరం పలుకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఫోన్ నంబర్లను, చిరునామాలను ఇచ్చి పుచ్చుకున్నారు. అప్పటి అధ్యాపకులైన సీతారామయ్య, డీవీ సుబ్బారావును ఆత్మీయంగా సత్కరించుకున్నారు. అదే బ్యాచ్‌లోని తమ నేస్తం, ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం, దాస సాహిత్య ప్రాజెక్టులో గుంటూరు – కృష్ణాజిల్లాల అధ్యక్షులుగా ఉన్న గద్దిపాటి శ్రీనివాసరావును ప్రత్యేకంగా సన్మానించుకున్నారు. ఆనాటి పూర్వవిద్యార్థులంతా పాల్గొని, మరిన్ని జ్ఞాపకాలను మూటగట్టుకుని తిరుగుముఖం పట్టారు. మళ్లీ కలుద్దాం...అంటూ వీడ్కోలు తీసుకున్నారు. ఈ సమ్మేళనాన్ని డాక్టర్ సుభాష్ బాబు అయినంపూడి, ఈదర రాజమల్లు, టీవీ చలపతిరావు, వేణు పర్యవేక్షించారు.

## తెనాలిలో అమర కళాకారుల సంస్మరణ సభలు



మాట్లాడుతున్న బొల్లిముంత కృష్ణ

**తెనాలి:** ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో తెనాలిలో సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 19వ తేదీ వరకు దివంగత కళాకారుల సంస్మరణ సభలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ తెలిపారు. స్థానిక గాంధీనగర్‌లోని ఇస్కఫ్ సమావేశ హాలులో ఆదివారం జరిగిన సమావేశానికి తెనాలి సీపీఐ సహాయ కార్యదర్శి తుంగ బాలస్వామి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి వల్లెం లక్ష్మి చెన్నకేశవరావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ 8వ తేదీ డాక్టర్ రాజారావు సంస్మరణ, 9 రచయితలు సుంకర వాసిరెడ్డి, నార్ల చిరంజీవి, 10 ప్రముఖ సంగీత దర్శకులు సి.మోహన్‌దాస్, తాతినేని చలపతిరావు, 11 రక్తకన్నీరు నాగభూషణం, లక్ష్మీ పెరిమాళ్ళు, 12 వీర మాచినేని సరోజిని, తాపీ రాజమ్మ, విశాలాంధ్ర సౌమిత్రి, 13 ఆచార్య ఆత్రేయ, 14 కొడాలి గోపాలరావు, తమ్మారెడ్డి కృష్ణమూర్తి, 15 జంగాల సీతారామయ్య, ఎంజే మోహనరావు, 16 డీవై సంపత్ కుమార్, 17 స్థానిక ప్రజానాట్యమండలి అమర కళాకారులు, 18 ప్రముఖ అభ్యుదయ సినీ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ, అనిసెట్టి సుబ్బారావు, 19వ తేదీన మహారచయిత తాపీ ధర్మారావు సంస్మరణ సభలు ప్రతిరోజు సాయంత్రం 5 గంటల్నుంచి ఇస్కఫ్ సమావేశ హాలులో నిర్వహిస్తామని తెలిపారు. సంస్మరణ సభ అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఇస్కఫ్ నాయకురాలు బెజ్జంకి నాగమణి, ప్రముఖ బుర్రకథ కళాకారిణి శివకుమారి, విజయ సారధి తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి నగర్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి పరీక్ష నిర్వహించిన స్థానికులతో శంకర కంటి ఆసుపత్రి వైద్యులు

**లక్ష్మీపురం:** సుందరయ్య విజ్ఞాన కేంద్రం(ప్రగతి నగర్) ఆధ్వర్యంలో శంకర కంటి ఆస్పత్రి సహకారంతో మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డులోని కేంద్రంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి 110 మంది హాజరై వైద్య పరీక్షలు పొందారు. అందులో 20 మందికి శస్త్ర చికిత్స అవసరమని డాక్టర్లు నిర్ధారించారు. డాక్టర్ నలిన్, డాక్టర్ అపర్ణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు కే శ్రీనివాసరావు, సీపీఎం నగర కార్యదర్శి కే నళినీ కాంత్ మాట్లాడుతూ శంకర కంటి ఆస్పత్రి వారు పేదలకు ఉచిత కంటి సేవలు గతంలో అనేక ప్రాంతాలలో క్యాంపులు నిర్వహించి పేదలకు శస్త్ర చికిత్స అందించడంలో ముందున్నారన్నారు. శస్త్ర చికిత్స గుర్తించిన వారిని బస్సులోనే శంకర కంటి ఆసుపత్రికి తీసుకుని వెళ్లి శస్త్ర చికిత్స అందించి మరలా తిరిగి పంపించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శిబిరం ఇన్‌చార్జి రవికుమార్, శంకర కంటి ఆస్పత్రి బృందం, సీఐటీయూ నాయకులు బి.ముత్యాలరావు, ఒ.పాములు, బి.సుజిత్, గుంజి మౌనిక, ఓ బాజీ ప్రియ, ఎల్.మహాలక్ష్మి, ఎస్.కె. నీలోఫర్, జె.వైష్ణవి, గుంజి నాగవంశీ, సిహెచ్.తేజస్విని పాల్గొన్నారు.

## ఎముకల సాంద్రత నిలుపుకోవడం కీలకం

సీనియర్ ఆర్థోపెడిక్ నిపుణులు కొల్లి జయకిషన్





ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న వైద్యులు

**లక్ష్మీపురం:** ఎముకల ఆరోగ్యాన్ని, సాంద్రతను నిలుపుకోవడానికి పౌష్టికాహారం, తేలికపాటి వ్యాయామాలు ఉపయోగపడతాయని సీనియర్ ఆర్థోపెడిక్ నిపుణులు కొల్లి జయ కిషన్ అన్నారు. ఆదివారం గుంటూరు అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఎముకలు, కీలు, కండరాలు వ్యాధులపై ఆరోగ్య సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో చాలా మందిని ఇబ్బందిపెట్టే వ్యాధి ఆస్టియో పోరోసిస్ అని, ఈ వ్యాధిలో బోన్ మినరల్ డెన్సిటీ తగ్గిపోతుందని దీంతో చిన్న దెబ్బలకే ఎముకలు విరిగిపోతాయన్నారు. కొంత మందికి వెన్నెముక, పక్కటెముకలకు ఆస్టియో పోరోసిస్ రావటం వలన సైలెంట్‌గా ఫ్రాక్చర్ అవుతాయన్నారు. నడుం నొప్పి అనిపించడం, నరాలు మొద్దుబారటం, కండరాలు క్షీణించటం లాంటి బాధలు ఆస్టియో పోరోసిస్ వ్యాధిలో ఎక్కువగా వస్తుంటాయని వివరించారు. ఈ వ్యాధి వచ్చిన తరువాత చికిత్స కంటే రాకుండా జాగ్రత్త పడటం ముఖ్యమన్నారు. ఆహారంలో కాల్షియం, విటమిన్–డి ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ జయ కిషన్‌ను అవగాహన సంస్థ సభ్యులు సత్కరించారు. సభకు ఆరోగ్య సభ కో–ఆర్డినేటర్ టి.వి.సాయిరాం సమన్వయం చేయగా.. సభలో విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ ఆర్.రామ చంద్రరావు, అనవేమా ట్రస్ట్ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి ప్రసంగించారు.

## విశ్వనాథ సాహిత్యం యువతకు ప్రేరణ కావాలి



గ్రంథావిష్కరణ చేస్తున్న వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

**నగరంపాలెం:** కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ సాహిత్యం యువతకు ప్రేరణ కావాలని వీవీఐటీ విద్యా సంస్థల ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. వీవీఐటీ విశ్వ విద్యాలయం, విశ్వనాథ సాహిత్య అకాడమీ సంయుక్తంగా ఆదివారం లక్ష్మీపురం శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం సమావేశ మందిరంలో విశ్వనాథ పథంలో యువత దృక్పథం పత్ర సమర్పణ సదస్సు నిర్వహించారు. విశ్వనాథ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ మద్దినేని సింహ కౌటిల్యచౌదరి సదస్సుకి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ విశ్వనాథ సత్యనారాయణలో తరచూ సగటు జీవి వేదన కనిపిస్తోందని అన్నారు. అధ్యక్షత వహించిన డాక్టర్ మద్దినేని సింహకౌటిల్య చౌదరి మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యం పునర్జీవనానికి కవి సామ్రాట్ సత్యనారాయణ తనదైన శైలిలో బాటలు వేశారని అన్నారు. చారిత్రక నవలల సదస్సుకు డాక్టర్ అబ్బరాజు మైథిలి అధ్యక్షత వహించారు. సాంఘిక నవలల సదస్సుకు వీబీ హేలికళ్యాణ్ అధ్యక్షత వహించారు. ముగింపు సభలో విశ్వనాథ పథంలో యువత గ్రంథావిష్కరణను వాసిరెడ్డి విద్యాసాగర్ చేశారు. యువ రచయితలను ప్రశంస పత్రాలతో సత్కరించారు. సదస్సులో కవి సామ్రాట్ మనవడు విశ్వనాథ సత్యనారాయణ, అకాడమీ సభ్యులు పిన్నమనేని మృత్యుంజయ రావు, రావెల సాంబశివరావు, మోదుగుల రవికృష్ణ, కోశాధికారి డాక్టర్ సెట్లం చంద్రమోహన్ పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీనారాయణదాస జయంత్యుత్సవాలు

**నగరంపాలెం:** స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తున్న శ్రీనారాయణదాస జయంతోత్సవాలు ముగిశాయి. శ్రీఆదిభట్ల నారాయణదాస కథాగాన కళా పరిషత్ ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ కమిటీ, సంస్థ నిర్వాహకులు జ్యోతిప్రజ్వలనతో ఆదివారం ప్రారంభించారు. సప్పా భారతి భాగవతారిని భక్త అంబరీష హరికథాగానం చేయగా, ప్రేక్షకులను అలరించింది. మృదంగంపై జగన్మోహిని, వయోలిన్‌పై చావలి శ్రీనివాస్ వాయిద్యాన్ని అందించారు.

### ఇద్దరిపై నాన్ బెయిలబుల్ కేసు

**తెనాలిరూరల్:** పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన కోలాటి దాసు, సుద్దపల్లి నవీన్‌లు శనివారం అర్ధరాత్రి విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా వారి ఎదుటే మద్యం సీసాలను రోడ్డు మీద పగలగొట్టి హడావుడి చేశారు. ప్రజలకు, వాహనదారులకు అసౌకర్యం కలిగిస్తూ భయభ్రాంతులకు గురి చేయడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆదివారం రాత్రి తెలిపారు.

### క్షణికావేశంలో బలవన్మరణం

**తెనాలిరూరల్:** క్షణికావేశంలో ఆటోడ్రైవర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కోపల్లె గ్రామానికి చెందిన పి.కోటేశ్వరరావు(40) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ, వ్యవసాయకూలి పనులకు సైతం వెళుతుంటాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో క్షణికావేశంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స పొందుతూ మృతి చెందగా వైద్యశాల నుంచి ఆదివారం వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ కె.ఆనంద్ తెలిపారు.

### కుంచనపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

**తాడేపల్లి రూరల్:** తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి ఎంపీయూపీ పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. నిర్వాహకులు అమ్మిశెట్టి శివ మాట్లాడుతూ తన తండ్రి కీ.శే.అమ్మిశెట్టి రామారావు జ్ఞాపకార్థం అమరావతి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు వేణు నాదెళ్ల, సౌజన్య కేతినేని ఆధ్వర్యంలో ఉచిత నేత్ర శిబిరాన్ని ఏర్పాటు చేశామని, సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా అమరావతి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కొతవరపు రాజేష్, మంద్రు విజయకుమార్, అమ్మిశెట్టి సురేష్, శ్రీలక్ష్మి, శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### భక్తులకు అన్నదానం



**మంగళగిరి టౌన్:** మంగళగిరి నగర పరిధిలోని శివాలయం రోడ్డులో శ్రీరత్నగర్భ సిద్ధి గణపతి దేవాలయం వద్ద శివభక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ భక్త బృందం ప్రతినిధులు మాట్లాడుతూ 33 సంవత్సరాలుగా ప్రతి నెలలో ఒకరోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. శివభక్త బృందం ప్రతినిధులు రామాంజనేయులు, రామకృష్ణారెడ్డి, గురునాథం, అవ్వారు వెంకటేశ్వరరావు, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన 'అర్బన్ బ్యాంకు' నామినేషన్ల ప్రక్రియ



నామినేషను దాఖలు చేస్తున్న ప్యానల్ సభ్యులు

**తెనాలి:** పట్టణంలోని 22వ నెంబరు తెనాలి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఆదివారం బ్యాంక్ చైర్మన్ అభ్యర్థితో సహా మొత్తం 12 డైరెక్టర్ల స్థానాలకు కూటమి పార్టీలకు చెందిన ఒకే ఒక ప్యానల్ సభ్యులు నామినేషన్లను వేశారు. వేరే నామినేషన్లు లేనందున స్క్రూటినీ అనంతరం ఎన్నికను ప్రకటించే అవకాశం ఉంది. మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగిన ఎన్నికల ప్రక్రియలో మంగమూరి హరిప్రసాదరావు, షేక్ జిలాని, కనగాల శ్రీనివాసరావు, తోట చంద్రశేఖర్, గద్దిపాటి నాగయ్య, బచ్చు శ్రీనివాసరావు, కోట పున్నారావు, కన్నెగంటి శ్రీనివాసరావు, కందేపి హరిప్రసాదరావు, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, దొప్పలపూడి శ్యాంసన్, గుండపనేని పూర్ణచంద్రరావు నామినేషన్లు దాఖలైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. కూటమి తరపున ఒకే ఒక ప్యానల్ నామినేషను చేసేందుకు సహకరించిన కూటమి పార్టీల నాయకులకు చైర్మన్ మంగమూరి హరిప్రసాదరావు ధన్యవాదాలు తెలియజేశారు. నామినేషన్లకు ముందు టీడీపీ, జనసేనలకు చెందిన అభ్యర్థులు ఆయా పార్టీల కార్యాలయాల్నుంచి ర్యాలీగా బయలుదేరి వచ్చారు. జనసేన పార్టీ కార్యాలయంలో అభ్యర్థులతో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడారు. ర్యాలీల్లో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సేవలు మరువరానివి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రామకృష్ణ, ప్రసాద్, తదితరులు

**తెనాలిఅర్బన్:** ఉపాధ్యాయుల సేవలు మరవరానివని పద్మశాలీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీవీఎస్ రామకృష్ణ పేర్కొన్నారు. పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమ సంఘం తెనాలిశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వారి అభినందన సభను తెనాలిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో నైపుణ్యంతో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారన్నారు. అందరూ మన్ననలు పొందడం వలనే అవార్డులు లభించాయని పేర్కొన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మాచర్ల నాగేశ్వరరావు, ఆకురాతి హరివరప్రసాద్, దివి ఉమాదేవి, మాచర్ల లీలా శ్రీనివాసమూర్తి, ఆరికాటి బాలసుబ్రమణ్యంలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ తెనాలి ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల సుబ్బారావు, కోశాధికారి తిరువీధుల నాగేశ్వరరావు, నాయకులు కటకం వెంకట ప్రసాద్, అందె బాలచంద్రమౌళి, కందుల శ్రీనివాసరావు, కొతవరపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా శాంతికి విఘాతం కలిగిస్తే పీడీ యాక్ట్

ఎస్ఐ హరిబాబు

**మంగళగిరి టౌన్:** ప్రజా శాంతికి విఘాతం కలిగిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని మంగళగిరి పట్టణ ఎస్ఐ హరిబాబు హెచ్చరించారు. మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ రౌడీ షీటర్లు నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై చట్టపరమైన చర్యలుంటాయని అన్నారు. అసాంఘిక కార్యకలాపాల్లో రౌడీ షీటర్లు పాల్గొంటే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి రౌడీషీటర్ కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని, ప్రతి వారం తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌కు హాజరుకావాలని స్పష్టం చేశారు. ప్రవర్తన మార్చుకొని సామాన్య జీవితాన్ని గడపాలని సూచించారు. సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌడీషీట్లను తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీపతిరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ చంద్రగ్రహణంతో ఆలయాలు మూత

**నగరంపాలెం:** సంపూర్ణ చంద్రగ్రహణం దృష్ట్యా ఆలయాలు ఆదివారం తాత్కాలికంగా మూతపడ్డాయి. కొత్తపేటలోని శ్రీఆంజనేయస్వామి దేవస్థానం, పశువుల ఆస్పత్రి ఎదురున్న శ్రీజగన్నాథ స్వామి దేవస్థానం, లాలాపేటలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం ఉదయం 11.30 గంటలకు మూసివేశారు. అదే విధంగా బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంతో పాటు పలు ప్రాంతాల్లోని ఆలయాలు మూసివేశారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను విరమించుకోవాలి



కుమ్మర క్రాంతి కుమార్

**నెహ్రూనగర్:** రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను విరమించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మెడికల్ కాలేజీలను తీసుకొచ్చారని.. వాటిని కూటమి ప్రభుత్వం యథావిధిగా పనులు చేపట్టి ముందుకు తీసుకుపోవాలని కోరారు. కరోనా కాలంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం కొరతగా ఉండడం వలన చాలా మంది మరణించడం జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం గుంటూరు తురకపాలెంలో మెడికల్ అవగాహన లేక 40 మంది చనిపోవడం జరిగిందన్నారు. ఇలాంటి ఇబ్బందులను అధిగమించేందుకు మెడికల్ వ్యవస్థను ప్రభుత్వం నిర్వహించాల్సి ఉండగా సదరు పెండింగ్ పనులన్నీ పీపీపీ మోడల్‌లో ప్రైవేటీకరణ చేస్తే నిరుపేదలకు వైద్యం అందకుండా పోతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలా చర్యలు తీసుకోవాలని కోరారు.